www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 17 మార్చి 2024 5 ఏలూరు

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆంధ్రప్రదేశ్ అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులు పొట్టి శ్రీరాములు అని టి.నరసాపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మాదంశెట్టి సోమరాజు అన్నారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి వేడుకలు టి.నరసాపురంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు ఆంధ్రుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఆర్యవైశ్యసంఘం మాజీ అధ్యక్షులు మాదంశెట్టి మల్లిఖార్జునరావు, చవ్వా నరసింహారావు, మాదంశెట్టి రామకృష్ణ, వంటిపల్లి సురేష్, కన్నం మల్లిఖార్జునరావు, కొనకళ్ల మోహన్ పాల్గొన్నారు.

ఎన్నికల 'కోడ్' కూసే..!

అసెంబ్లీ, లోకసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల - అమల్లోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి

ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్, మే 13న ఎన్నికలు - 21 రోజుల అనంతరం జూన్ 4న ఓట్ల లెక్కింపు

నాలుగో విడతలో ఎన్నికల నిర్వహణపై అభ్యర్థుల్లో నిర్వేదం - ఎక్కువ సమయం ఉండటంతో ఖర్చుపై లోలోన ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఇక నుంచి అధికారులంతా ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో పని చేయాల్సి ఉంటుంది. ప్రజాప్రతినిధుల ఆదేశా లకు అనుగుణంగా అధికారులు ఇక నుంచి పని చేసే వీలుండదు. జిల్లాలో ఎన్నికల కోడ్ ఆఫ్ కాండాక్ట్ సజావుగా అమలు చేసేందుకు జెడ్‌పి సిఇఒను నోడల్ అధికారిగా నియమించారు. మండలాల్లో ఎంపిడిఒలు, పట్టణాల్లో కమిషనర్లు నోడల్ అధికారులుగా పని చేయనున్నారు. కోడ్ అమల్లోకి రావడంతో ఇక నుంచి పరిస్థితి పూర్తిగా మారనుంది. ప్రభుత్వ పథకాల అమలుపైనా ఆంక్షలు ఏర్పడే అవకాశం ఉంది.

ఎన్నికల షెడ్యూల్ ఇలా..

నోటిఫికేషన్:	18.4.2024
నామినేషన్ల గడువు:	25.4.2024
నామినేషన్ల పరిశీలన:	26.4.2024
ఉపసంహరణ గడువు:	29.4.2024
పోలింగ్:	13.5.2024
ఓట్ల లెక్కింపు:	04.6.2024

నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు
ఉంగుటూరు	214
దెందులూరు	239
ఏలూరు	212
పోలవరం	284
చింతలపూడి	273
నూజివీడు	286
కైకలూరు	235

నాలుగో విడతలో ఎన్నికలు.. అభ్యర్థుల్లో గుబులు

దేశవ్యాప్తంగా ఏడు విడతల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలను నాలుగో విడతలో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. 2019లో తొలివిడతలో ఎన్నికలు జరిగాయి. దీంతో ఏప్రిల్ రెండో వారానికి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యింది. ఈసారి ఏప్రిల్ 18న నోటిఫికేషన్, 25వ తేదీ వరకూ నామినేషన్ల గడువు, 26న పరిశీలన, 29న ఉపసంహరణ, మే 13న పోలింగ్, జూన్ నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. 2019లో ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత దాదాపు నెల రోజుల వ్యవధిలో ఎన్నికల ప్రక్రియ ముగిసింది. ఈసారి షెడ్యూల్ విడుదలకు, పోలింగ్‌కు మధ్య దాదాపు రెండు నెలల వ్యవధి ఉంది. దీంతో అభ్యర్థుల్లో గుబులు నెలకొంది. వేసవి ఎండల తీవ్రత ఇబ్బందులతోపాటు రెండు నెలల వ్యవధి ఉండటంతో ఎన్నికల ఖర్చు భారీగా అయ్యే పరిస్థితి ఉందని అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రచారానికి ఎక్కువ సమయం ఉండటంతో ప్రతిరోజూ పెద్దఎత్తున ఖర్చు కానుందని లెక్కలు వేస్తున్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత సైతం ఈసారి పోలింగ్‌కు రోజులు, అంతకు పరిస్థితుల్లో అసెంబ్లీకి 14 రోజులు వ్యవధి ఉంది. గతంలో పది తక్కువగానే సమయం ఉండేది. ప్రస్తుత పోటీ చేస్తున్న అభ్యర్థికి రూ.25 నుంచి రూ.30 కోట్లు వరకూ ఖర్చవుతుందని అభ్యర్థులు అంతర్గత సమావేశాల్లో చెబుతున్నారు. ఎన్నికల ప్రక్రియ నాలుగో విడతకు వెళ్లడంతో ఖర్చు మరో రూ.పదికోట్లు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బరిలో నిలబడిన అభ్యర్థులు ఖర్చు గురించి లోలోన తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రెండు జిల్లాల్లో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

నియోజకవర్గాలవారీ ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్స్	మొత్తం
ఉంగుటూరు	1,01,152	1,04,177	5	2,05,334
దెందులూరు	1,08,465	1,14,305	7	2,22,777
ఏలూరు	1,10,254	1,20,423	47	2,30,724
పోలవరం (ఎస్‌టి)	1,22,201	1,30,380	11	2,52,592
చింతలపూడి (ఎస్‌సి)	1,33,747	1,37,714	41	2,71,502
నూజివీడు	1,17,398	1,19,730	11	2,37,139
కైకలూరు	1,00,680	1,03,661	7	2,04,348
మొత్తం	7,93,897	8,30,390	129	16,24,416

వైసిపి అభ్యర్థులు వీరే

కారుమూరి సునీల్ ఏలూరు ఎంపీ అభ్యర్థి

ఆళ్ల నాని, ఏలూరు

కొఠారు అబ్బయ్యచౌదరి దెందులూరు



పుప్పాల వాసుబాబు ఉంగుటూరు

మేకా వెంకటప్రతాప్ అప్పారావు, నూజివీడు

తెల్లం రాజ్యలక్ష్మి పోలవరం

కంభం విజయరాజు చింతలపూడి



దూలం నాగేశ్వరరావు కైకలూరు

గూడూరి ఉమాబాల నరసాపురం ఎంపీ అభ్యర్థి

ముదునూరి ప్రసాదరాజు నరసాపురం

కారుమూరి నాగేశ్వరరావు, తణుకు

కొట్టు సత్యనారాయణ తాడేపల్లిగూడెం

చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఆచంట

గ్రంధి శ్రీనివాస్ భీమవరం

పివిఎల్.నరసింహరాజు ఉండి



గుడాల గోపీ పాలకొల్లు

కట్టుదిట్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి

అధికారులకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై వివిధ శాఖల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఏమైనా ప్రభుత్వ పథకాలకు సంబంధించి రాజకీయపక్షాల ప్రతినిధుల ఫొటోలు ముద్రించి ఉన్న పోస్టర్లను, ఫొటోలను, వాల్‌రైటింగ్ తదితరాలను తొలగించినట్లు ఆదివారం సాయంత్రంకల్లా తహశీల్దార్లు, ఎంపిడిఒలు ధ్రువీకరణ పత్రం సమర్పించాలని ఆదేశించారు. రానున్న 24 గంటల్లో ప్రభుత్వ ఆస్తులపై వాల్‌రైటింగ్‌లు, పోస్టర్లు, పేపర్లు, కటౌట్లు, హోర్డింగ్‌లు, బ్యానర్లు, జెండాలు మొదలైనవన్నీ తొలగించాలని ఆదేశించారు. అనధికారిక రాజకీయ ప్రకటనలు పబ్లిక్ ఆస్తులపై, బస్టాండ్, రైల్వే స్టేషన్, రైల్వే వంతెనలు, రోడ్‌వేలు, ప్రభుత్వ బస్సులు, విద్యుత్ స్తంభాలపై 48 గంటల్లోపు తొలగించాలన్నారు. ప్రధాని, సిఎం, మంత్రులు, ఇతర రాజకీయ కార్యకర్తలతో సహా ప్రభుత్వ భవనాలపై రాజకీయ నేతలు ఛాయాచిత్రాలు తొలగించాలన్నారు. మోడల్ ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత విద్యుత్ బిల్లులు, నీటి బిల్లులు, బోర్డింగ్ పాస్‌లు, టీకా సర్టిఫికెట్లు మొదలైన వాటిలో రాజకీయ కార్యకర్తలు, పార్టీల ఫోటోలు లేదా సందేశాలు, చిహ్నాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల పర్యటనల్లో మంత్రులకు ప్రభుత్వ అతిథి గృహాలలో వసతి కల్పించరాదన్నారు. ప్రభుత్వోద్యోగి ప్రవర్తన నిష్పక్షపాతంగా ఉండాలని, వారు ఏదైనా పార్టీకి లేదా అభ్యర్థికి అనుకూలంగా వ్యవహరించేందుకు ఎంతమాత్రం వీలులేదన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడితే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోబడతాయన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, అసిస్టెంట్ ట్రెయినీ కలెక్టర్ టి.శ్రీపూజ, డిఆర్ఒ డి.పుష్పమణి పాల్గొన్నారు. వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులైన ఎన్ఎస్‌కె.ఖాజావలి, కె.అద్దయ్య, వై.భవానీశంకరి, ఎం.ముక్కంటి, ఎంసిసి నోడల్ అధికారి, జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, ఎన్నికల నిర్వహణ వివిధ విభాగాల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లను శనివారం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, రిటర్నింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. స్థానిక సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని, స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.

గ్రూప్-1 పరీక్షలకు సర్వం సిద్ధం

ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

హాజరు కానున్న 4,372 మంది విద్యార్థులు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 పరీక్షల నిర్వహణలో భాగంగా ఈ నెల 17వ తేదీ ఆదివారం జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. ఈ పరీక్ష నిర్వహణకు జిల్లాలో ఐదు కేంద్రాలు ఏర్పాటు చేశామని, 4,372 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు, వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు తమ హాల్‌టిక్కెట్‌తోపాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఒరిజినల్‌తో పరీక్షా సమయానికి గంట ముందుగా చేరుకోవాలని, పరీక్షా సమయం దాటిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతిం చబోమని స్పష్టం చేశారు. జిల్లాలో గ్రూప్-1 పరీక్షకు హాజరు కానున్న అభ్యర్థుల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. కంట్రోల్ రూమ్ నెంబరు : 9491041436కు ఫోన్ చేయవచ్చునని తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేత

గుర్తింపు కార్డులు, గ్లౌజులు అందజేస్తున్న పెదబాబు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పారిశుధ్య కార్మికులు, నాన్ పారిశుధ్య కార్మికులకు ఆరోగ్యం, అభివృద్ధి విషయంలో పూర్తి పర్యవేక్షణ మేము తీసుకుంటున్నామని, మంచి సేవలు ప్రజలకు అందించాలని ఏలూరు నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం ప్రాంగణంలో శనివారం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, నాన్ అవుట్‌సోర్సింగ్ అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, నైట్ శానిటేషన్, మలేరియా విభాగాల్లో పనిచేస్తున్న 400 మంది కార్మికులకు గుర్తింపు కార్డులు, రాత్రిపూట మెరుస్తూ ఉండే రేడియం యాప్రాన్లు, చేతి గ్లౌజులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల ఆరోగ్య విషయంలో పూర్తి శ్రద్ధ వహిస్తున్నామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి పారిశుధ్య సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు కూడా మెడికల్ చెకప్‌లు చేయించడం కంటిన్యూగా జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు, సాధారణ మరణం సంభవిస్తే రూ.2 లక్షలు వారి కుటుంబ సభ్యులకు అందజేస్తున్నామన్నారు. అదేవిధంగా కార్మికులు కూడా శానిటేషన్ విషయంలో ఎక్కడ అలసత్వం వహించకుండా పనిచేసి ప్రభుత్వానికి, కార్పొరేషన్ పాలకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఎస్ఎంఆర్ పెదబాబు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఒ డాక్టర్ మాలతి, మున్సిపల్ మేనేజర్ మూర్తి పాల్గొన్నారు.

పది పరీక్షలకు పటిష్టమైన బందోబస్తు

డిఇఒ ఎస్.అబ్రహాం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లాలో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పూర్తిస్థాయిలో విద్యాశాఖ కృషి చేస్తుందని, అంతేకాకుండా పటిష్టమైన బందోబస్తు మధ్య పదవ తరగతి పరీక్షలు నిర్వహించనున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహాం శనివారం తెలిపారు. శనివారం సాయంత్రం ఏలూరు నగరంలోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు ఈనెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పటిష్టమైన బందోబస్తు మధ్య నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతి పరీక్ష ఉదయం 9:30 నిమిషాలకు ప్రారంభమై 12 గంటల 45 నిమిషాలకు ముగియనుందని, విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష హాలుకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఎవరైనా విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలలో ఏదైనా సందేహాలు ఉన్నట్లయితే పరీక్ష మొదలయ్యే ముందు రోజు తమ తల్లిదండ్రులతో కలిసి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసుకోవచ్చని తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో పదో తరగతి పరీక్షలు 139 కేంద్రాలలో నిర్వహించనున్నామన్నారు. ఈ పరీక్షకు మొత్తం రెగ్యులర్ విద్యార్థులు 24,125 మంది హాజరు కానున్నారన్నారు. వీరిలో బాలురు 11,760 మంది కాగా బాలికలు 12,365 మంది హాజరు కానున్నారన్నారు. ప్రయివేట్ విద్యార్థులు మొత్తం 8,230 మంది హాజరు కావాల్సి ఉండగా వారిలో 5 వేల మంది బాలురు, 3,230 మంది బాలికలు ఉన్నారు. ప్రయివేట్, రెగ్యులర్ విద్యార్థులు మొత్తం కలిపి 32,350 మంది పదో తరగతి పరీక్షకు ఈ ఏడాది హాజరుకానున్నారని తెలియజేశారు.

జంగారెడ్డిగూడెంలో 12 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

జంగారెడ్డిగూడెం టౌన్: ఈనెల 18వ తేదీ నుంచి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జంగారెడ్డిగూడెం ఎంఇఒ రాముడు తెలిపారు. మండలంలోని రూరల్, అర్బన్ కలిపి 12 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జంగారెడ్డిగూడెం బాయ్స్ 1, 2, జంగారెడ్డిగూడెం బాలికలు, శ్రీచైతన్య, విద్యా వికాస్, సూర్య, త్రివేణి, భాష్యం, లక్కవరం జెడ్‌పిహెచ్ స్కూల్ సెంటర్లలో పరీక్షలు జరుగుతాయని అన్నారు. ఈ 12 పరీక్షా కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు మొత్తం 1,885 మంది ఉన్నారని, వీరిలో బాలురు 963, బాలికలు 922 మంది పరీక్షకు హాజరు కావలసి ఉందని, ఓపెన్ స్కూల్ విద్యార్థులు మొత్తం 365 మంది పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. వీరికి నాలుగు సెంటర్లు ఏర్పాటు చేశామని, ఒకటి త్రివేణి జూనియర్ కాలేజ్, రెండు గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, మూడు రామచంద్ర జూనియర్ కాలేజ్, నాలుగు లక్కవరం జెడ్‌పిహెచ్ స్కూల్ సెంటర్లు కేటాయించామన్నారు. విద్యార్థులంతా ఉదయం 9 గంటలు కల్లా పరీక్షా కేంద్రాల్లో ఉండాలని, ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని అన్నారు. వీరికి 120 మంది ఇన్విజిలేటర్ల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహణ జరుగుతుందన్నారు. ప్రతి సెంటర్‌లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

టి.నరసాపురంలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

టి.నరసాపురం: మండలంలో పది పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారి టి.రామ్మూర్తి తెలిపారు. స్థానిక మానవ వనరుల కేంద్రంలో విలేకరుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు 642 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. మండలంలో మొత్తం 3 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా టి.నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 256, బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 235, అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలో 92, మర్రిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల నుంచి జీలుగుమిల్లి పరీక్ష కేంద్రంలో 59 మంది మొత్తం మండలం నుంచి 642 మంది విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు.

పోలవరంలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

పోలవరం: ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాటు చేసినట్లు ఇన్‌ఛార్జి ఎంఇఒ జి.సురేష్ బాబు తెలిపారు. జిల్లా కలెక్టర్ విద్యాశాఖ ఆదేశాల మేరకు పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు సురేష్ బాబు తెలిపారు. పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సెయింట్ ఫ్రాన్సిస్ ప్రయివేట్ పాఠశాలలను మండలంలో పరీక్షా కేంద్రాలుగా కేటాయించామన్నారు. పోలవరంలో 262 మంది, గూటాల స్కూల్ నుంచి 176, సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ నుంచి 161 మంది మొత్తం మండలంలో 599 విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పోలవరం మండలం నుంచి 31 మంది ఇన్విజిలేటర్లు హాజరవుతారన్నారు. ఈనెల 26వ తేదీ వరకు ప్రతి ఉదయం 9:30 నుంచి 12:30 నిమిషాల వరకు పదవ తరగతి పరీక్షలు జరుగుతాయని సురేష్ బాబు తెలియజేశారు.

కొయ్యలగూడెంలో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

కొయ్యలగూడెం: మండలకేంద్రంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఈనెల 18 నుంచి 5 పరీక్ష కేంద్రాల్లో జరగనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి జె.సురేష్ బాబు తెలిపారు. పరీక్ష కేంద్రాలు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పరింపుడి 240 మంది విద్యార్థులు, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల కొయ్యలగూడెం 211 మంది విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కన్నాపురం 312 మంది విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బయ్యనగూడెం 350 మంది విద్యార్థులు, ఆగ్జిలయం ఉన్నత పాఠశాల గౌరవరం 178 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు మండలంలో 1,291 మంది విద్యార్థులు హాజరవుతుండగా సదరు పరీక్షల నిర్వహణ కోసం ఐదుగురు చీఫ్ సూపరింటెండెంట్లను, ఐదుగురు డిపార్ట్మెంట్ ఆఫీసర్‌ను, ఇద్దరు అడిషనల్ డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్‌ను, 62 మంది ఇన్విజిలేటర్స్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి ఏలూరు వారు నియమించారని తెలియజేశారు.

ట్రిపుల్ ఐటీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు పెట్టే అన్నంలో పురుగులు, బొద్దింకలు ఉన్నాయని దీనిపై సంబంధిత అధికారులు విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈమేరకు పురుగులు, బొద్దింకలు ఉన్న ఫోటోలను కూడా పత్రికలు విడుదల చేశారన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఇటీవల పరీక్షల కాలంలో విద్యుత్తు అంతరాయం కలిగి, జనరేటర్ పాడైపోయి రాత్రులు అంధకారంలో ఉండే పరిస్థితి నెలకొందనే విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పుడు విద్యార్థులకు పెట్టే ఆహారం నాణ్యమైంది కాకుండా నాసిరకమైన, అనారోగ్యానికి గురిచేసే ఆహారాన్ని పెట్టడం అత్యంత దారుణమని ఆయన విమర్శించారు. అంతకుమించి పురుగులతో ఉన్న అన్నం పెట్టడం కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి అద్దం పడుతుందన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో తలెత్తుతున్న ఈ సమస్యలు కొత్తకాదని, ఇప్పటికే అనేక సమస్యలు వెల్లడయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యాసంస్థల్లో తరచుగా ఇలాంటి సమస్యలు తలెత్తడం పట్ల ప్రభుత్వం, ట్రిపుల్‌ఐటీ అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం తక్షణమే దృష్టి సారించి విద్యార్థులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో మరోసారి ఈవిధమైన వార్తలు రాకుండా, విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా, తగుచర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అభ్యర్థులు.. అసంతృప్తులు..!

జిల్లాలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన అభ్యర్థులు దాదాపుగా ఖరారయ్యారు. కైకలూరు స్థానం నుంచి బిజెపి బరిలోకి దిగితే అభ్యర్థి ఎవరనేది తేలాల్సి ఉంది. అలాగే నరసాపురం, ఏలూరు ఎంపీ స్థానాలకు సంబంధించి టిడిపి కూటమి నుంచి అభ్యర్థులు ఖరారు కావాల్సి ఉంది. ఇక అభ్యర్థిత్వాలు ఖరారైన తర్వాత తిరుగుబాట్లు, అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా ప్రతిపక్ష టిడిపి కూటమిలోనే ఇవి ఎక్కువ ఉండటం గమనార్హం. అయితే ఈ అసంతృప్తులు తిరుగుబాటు స్థాయికి చేరతాయా.. లేక సమసిపోతాయా అనేది నామినేషన్ల ఘట్టం వరకూ వేచిచూడాలి.

అభ్యర్థుల ఖరారుతో రెండు జిల్లాల్లో రాజకీయం మరింత వేడెక్కింది. అభ్యర్థులు గెలుపు బాట కోసం ముఖ్యనేతలు, అనుచరులతో మంతనాలు సాగిస్తూ ప్రచారంలోనూ నిమగ్నమయ్యారు. అధికార వైసిపి ముందుగా ప్రకటించినట్లుగానే ఆయా నియోజకవర్గ సమన్వయ కర్తలుగా ఉన్నవారినే అభ్యర్థులుగా ప్రకటించింది. ఈ తరుణంలో సిట్టింగ్ ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను లక్ష్యం చేసుకుని తరచూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్న టిక్కెట్ దక్కని చింతలపూడి సిట్టింగ్ ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా ఏ వైఖరి తీసుకుంటారో వేచిచూడాలి. అధికార వైసిపికి స్వపక్షం అక్కడ తప్ప ఇతర నియోజకవర్గాల్లో పెద్దగా ఇబ్బందులేమీ పైకి కానరావడం లేదు. పాలకొల్లు, ఆచంట, తాడేపల్లిగూడెం, ఏలూరు తదితర నియోజకవర్గాల్లో లోలోన ఉన్న అసంతృప్తులు ఏ మేరకు ప్రభావం చూపుతాయో వేచిచూడాలి.

ఇక ప్రతిపక్ష టిడిపి కూటమికి మాత్రం ఎక్కువ నియోజకవర్గాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నూజివీడులో మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతారా.. లేక మౌనంగా ఉండిపోతారా అనేది స్పష్టత రావాల్సి ఉంది. ఉండిలో మాజీ ఎంఎల్ఎ శివరామరాజు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని ప్రకటించడంతో ఆ నియోజకవర్గ రాజకీయం రసవత్తరంగా మారింది. శివ టిడిపి ఓట్లు చీల్చుతారా, లేక వైసిపి ఓట్లు చీల్చుతారా అనే చర్చ పెద్దఎత్తున సాగుతోంది. అయితే నరసాపురం ఎంపీ అభ్యర్థిగా రఘురామకృష్ణంరాజు బరిలోకి దిగితే శివను పోటీ నుంచి తప్పించే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. ఏం జరుగుతుందో వేచిచూడాలి. అలాగే నరసాపురం సీటు ఆశించిన టిడిపి మాజీ ఎంఎల్ఎ మాధవనాయుడు భంగపాటుకు గురయ్యారు. ఇక్కడ గ్రూపుల పోరు ఎక్కువ కావడంతో టిడిపి అధిష్టానం తెలివిగా జనసేనకు ఈ సీటు ఇచ్చేసిందనే ప్రచారం సాగుతోంది. అయితే తన భవిష్యత్తు కార్యాచరణ త్వరలో ప్రకటిస్తానని మాధవనాయుడు ప్రకటించడం ఆసక్తికరంగా మారింది. అలాగే పోలవరం, ఉంగుటూరుల్లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీల నుంచి, నేతల నుంచి జనసేనకు ఆయా సీట్లు కేటాయింపుపై నిరసనలు ఎగసినా అధిష్టానం చాకచక్యంగా చల్లబరినట్లు ప్రస్తుత పరిస్థితులు కన్పిస్తున్నాయి. అయితే వీరు జనసేన అభ్యర్థుల విజయానికి ఏమేరకు కృషి చేస్తారనేది వేచిచూడక తప్పదని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. జనసేనకు సంబంధించి ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు, తణుకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి విడివాడ రామచంద్రరావు పైపైకి ఎలాగున్నా లోలోన తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నట్లు తెలుస్తోంది. దీనికితోడు నరసాపురం టిక్కెట్ ఆశించి జనసేనలో చేరిన మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు పయనం ఎటో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అక్కడ బొమ్మిడి నాయకర్ అభ్యర్థిత్వం దాదాపు ఖరారైన సంగతి తెలిసిందే. అయితే అది అధికారికం కాదని కొత్తపల్లి చెబుతుండటం గమనార్హం. ఈ ఎన్నికల్లో తాను కచ్చితంగా పోటీ చేస్తానని జనసేనలో చేరకముందు ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో కొత్తపల్లికి టిక్కెట్ దక్కకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారా లేదా అనేది వేచిచూడాలి. మొత్తానికి అసంతృప్తులు ఏ రూపం తీసుకుంటాయనేది నామినేషన్ల పర్వం ముగిసే వరకూ వేచిచూడక తప్పదని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ఎన్నో ఏళ్లుగా అధ్వాన స్థితిలో ఉన్న మట్టి రోడ్లను సిసి రోడ్లుగా మార్చేందుకు చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజు శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. శనివారం ఉదయం కంభం విజయరాజు వివిధ వార్డుల్లో పర్యటించి సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మున్సిపల్ ఛైర్పర్సన్ బత్తిన నాగలక్ష్మి, సీనియర్ నాయకులు జెట్టి గురునాధరావు, మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న విజయరాజు

బచ్చు మోహిని మృతికి సంతాపం

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని సీనియర్ జర్నలిస్ట్ బచ్చు పాండురంగ సత్య వరప్రసాద్(బిపిఆర్) జీవిత భాగస్వామి బచ్చు మోహిని మృతికి ఎపిడబ్ల్యూజెయు కామవరపుకోట శాఖ ప్రగాఢ సంతాపం తెలిపింది. శనివారం మోహిని దిన కార్యం సందర్భంగా మండల వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ గౌరవాధ్యక్షులు టివిఎస్ రాజు, అధ్యక్ష ,కార్యదర్శులు కడిమి పాపారావు, వీరమల్లు మధు, సీనియర్ జర్నలిస్ట్ వై.రాంబాబు, మేనుగుల మురళి, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, దాసి భూషణం, బి.రామకృష్ణ, తదితర జర్నలిస్టు యూనియన్ సభ్యులు మోహిని మృతికి తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

కాపుల ద్రోహి ముద్రగడ : పులి శ్రీరాములు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ముద్రగడ పద్మనాభం కాపు కులద్రోహిగా, చరిత్ర హీనుడిగా మిగిలిపోతారని కాపు సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పులి శ్రీరాములు విమర్శించారు. 1988లో వంగవీటి మోహన రంగా, కన్నా లక్ష్మీనారాయణ, ఆకుల శివయ్య నాయుడు, పిళ్ళా వెంకటేశ్వరరావు, మిరియాల వెంకట్రావు, ఎం.హెచ్.రావు, జె.ఎస్.రావు, పులి శ్రీరాములు, గుర్రాల నరసింహా రావు, ముద్రగడ పద్మనాభం తదితర 17 మందిమి కలిసి విజయవాడలో కాపునాడు స్థాపించామన్నారు. ఆకుల శివయ్య నాయుడు అధ్యక్షతన కాపు నాడు రాష్ట్ర తొలి కమిటీలో కార్యదర్శి సభ్యుడిగా ఉన్నానని పులి శ్రీరాములు తెలిపారు. ఆనాటి నుంచి ముద్రగడతో సహచర కాపు నేతగా కాపు సామాజిక బాధ్యతల్లో ఉన్నానని, ముద్రగడలో నాయకత్వ లక్షణాలు లేవని, చిన్న చిన్న విషయానికి కూడా అలుగుతాడన్నారు. తునిలో అమాయక కాపు యువతను రెచ్చగొట్టాడని, ఆ సంఘటనలో సంఘవిద్రోహక శక్తులు చొరబడి విధ్వంసం సృష్టించారన్నారు. వైసిపిలో చేరిన ముద్రగడ సమాజానికి ఏం సందేశమిస్తారని పులి ప్రశ్నించారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ముద్దరబోయిన

'అవినీతిపరుడుకి టికెట్ ఇచ్చారు'

ప్రజాశక్తి - ముసునూరు

అవినీతిపరుడు పార్టీ మారతాను అని పార్టీ కండువా కప్పుకోకపోయినా ఇన్‌ఛార్జి పదవి అప్పగించేంత మంచివాడు అయిపోయాడా అంటూ మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. శనివారం మండలంలోని గోపవరం గ్రామంలో ముద్దరబోయిన ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో గత పది సంవత్సరాలుగా గెలుపు ఓటములతో సంబంధం లేకుండా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ, 175 నియోజకవర్గాలలో మొదటి 10 స్థానాలలో తాను నిలిచాను అన్నారు. అయినా తనను కాదని పక్క పార్టీ వద్దనుకున్న వ్యక్తికి టికెట్ ఇవ్వడం తనకు ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. ఈ విషయంలో తాను నమ్మిన కార్యకర్తల మాట ప్రకారం వారికి అండగా నియోజకవర్గంలోనే ఉంటూ రాజకీయాలు చేస్తానన్నారు వచ్చే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి దిగుతున్నానన్నారు. గత పది సంవత్సరాలుగా నూజివీడు నియోజకవర్గంలో ఇంటింటికి ముద్దరబోయిన కార్యక్రమంలో వెళ్లానని, ప్రదాన సమస్యలపై పూర్తి అవగాహనతో తాను ఉన్నానన్నారు. తాను అధికారంలోకి వస్తే ఐదు సంవత్సరాలలో నియోజకవర్గ సమస్యలను పరిష్కరించి చూపుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రముఖ క్రికెటర్ చాముండేశ్వరినాథ్ వితరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రముఖ రంజీ క్రికెటర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ పూర్వపు సెక్రటరీ ఉంగుటూరు మండలం కాగుపాడుకు చెందిన వంకిన ఛాముండేశ్వరినాథ్ రూ.30 లక్షల తన సొంత నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులకు వితరణ చేశారని సర్పంచి కడియాల సుదేష్ణ వెల్లడించారు. గ్రామంలో వాటర్ ప్లాంట్, స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ, ముఖద్వారం, స్టేజీ సుందరీకరణ పనులకు శనివారం భూమిపూజలు చేశారు. ఛాముండేశ్వరినాథ్ తల్లిదండ్రులు వంకిన వెంకట రాజేశ్వరప్రసాద్, అంజనాదేవి జ్ఞాపకార్థం వితరణ చేసినట్లు గ్రామస్థులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం.ఉమాదేవి, కడియాల రవిశంకర్, వంకిన ధర్మరాజు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ ఆనందరావు, కిషోర్ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సర్పంచి

నేరాలు - ఘోరాలు

వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

రోడ్డు ప్రమాదంలో ట్రాన్స్‌జెండర్‌తో పాటు ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన జంగారెడ్డిగూడెంలోని ఏరియా ఆసుపత్రి సమీపంలో చోటుచేసుకుంది. శనివారం మధ్యాహ్నం జంగారెడ్డిగూడెంలోని ఏరియా ఆసుపత్రి బిఎస్ఎన్ఎల్ ఆఫీసు ఎదురుగా కారు బీభత్సం సృష్టించి, ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొట్టి పక్కనే ఉన్న ద్విచక్ర వాహనంపై పడింది. కారు ప్రమాదంలో ఆటోలో ఉన్న సోనీ సత్య రాధిక(ట్రాంజెండర్), ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కారు వదిలి కార్ డ్రైవర్ పరార్ అయ్యాడు. కారును పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేస్తున్నారు.

నూజివీడు రూరల్: మండలంలోని బత్తులవారి గూడెం గ్రామంలో ఆగి ఉన్న టాటామాజిక్‌ని కొండపల్లి నుంచి వస్తున్న గ్యాస్ బండల లోడు లారీని శనివారం ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఎన్‌టిఆర్ జిల్లా పోరాట నగర్‌కు చెందిన చిట్టెమ్మ(45), కాలేశ్వరి(40), సంధ్య(30)కు తీవ్ర గాయాలయ్యాయి. వీరందరూ శుభకార్యానికి హాజరై తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇంటర్నెట్ సెంటర్‌లో చోరీ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని మీర్జాపురం గ్రామంలో రాయల్ కమ్యూనికేషన్ నెట్ సెంటర్‌లో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. నెట్ సెంటర్‌లో ఉంచిన రెండు సెల్ ఫోన్లు, రూ.లక్ష నగదు చోరీకి గురయ్యాయని యజమాని కళ్యాణ్ తెలిపారు. అనంతరం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, సిసి ఫుటేజ్ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు చర్యలు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రాజీకి ఉత్తమ మార్గం 'జాతీయ లోక్ అదాలత్'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కోర్టు కేసుల నుంచి విముక్తి పొందడానికి జాతీయ లోక్ అదాలత్ కక్షిదారులకు మంచి వేదికని రెండవ అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో వున్న న్యాయసేవాధికార సంస్థ భవనంలో జాతీయ లోక్ అదాలత్ ప్రారంభంలో భాగంగా తొలుత కక్షిదారులు, న్యాయవాదులతో జాతీయ లోక్ అదాలత్ న్యాయ విజ్ఞాన సదస్సు, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో రెండవ అదనపు జిల్లా జడ్జి పి.మంగకుమారి మాట్లాడుతూ కోర్టు కేసుల నుంచి విముక్తి పొంది ప్రశాంత జీవనం పొందడానికి కక్షిదారులకు జాతీయ లోక్ అదాలత్ మంచి వేదికని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ఏలూరు కోర్టులో జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుకోకుండా పరిస్థితుల ప్రభావం వల్ల కోర్టు కేసుల్లో ఉండి సంతోషానికి దూరం అవుతున్నారని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా ఇరువురి పార్టీవారు తమ కేసులు జాతీయ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

ఏలూరు సిటీ : మాట్లాడుతున్న మంగాకుమారి

ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ డబ్బు, సమయం వృధా చేయకుండా, పట్టింపులకు పోకుండా రాజీతో కేసుల నుంచి విముక్తి పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి కెకెవి బుల్లి కృష్ణ, ప్రభుత్వ న్యాయవాది బిజె.రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనే సీతారాం, బార్ అసోషియేషన్ జనరల్ సెక్రెటరీ ఎన్ఎంఎం.నాగరాజు, దిశ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సుబ్బారావు జాతీయ లోక్ అదాలత్ గురించి వివరించారు. తొలుత జాతీయ లోక్ అదాలత్‌ను రెండవ అదనపు జిల్లా జడ్జి పి.మంగకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం లోక్ అదాలత్‌లో పరిష్కరించబడిన వాహన ప్రమాద నష్టపరిహారం కింద టాటా ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా రూ.10 లక్షల నష్టపరిహారం చెక్కును రెండవ అదనపు జిల్లా జడ్జి పి.మంగకుమారి కక్షిదారులకు అందజేశారు. టాటా ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్ టి.భాస్కర్ సంబంధించిన స్టాండింగ్ కౌన్సిల్ కెవిఆర్‌కె.సుబ్బారావు పిటిషనర్స్ తరపున బి.రంగారావు కేసును రాజీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

చింతలపూడి: లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల డబ్బు, సమయాన్ని ఆదా చేసుకోవచ్చని జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు అన్నారు. శనివారం చింతలపూడి కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ కార్యక్రమంలో 100 కేసులు రాజీ చేసినట్లు తెలిపారు. క్రిమినల్ కేసులు 64, చెక్ బౌన్స్ కేసులు 04, మద్యం కేసులు 10, సివిల్ కేసులు 06, మనోవర్తి కేసులు 02, బ్యాంక్ లిటిగేషన్ కేసులు 01, టెలిఫోన్ బకాయి కేసులు 13 రాజీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సామయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాణిక్యాల రావు, బెంచ్ మెంబెర్స్ పట్నాల శ్రీనివాసు, ఎమ్‌డీ అక్బర్ అలీ, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరగాలి

92 శాతం ఓటింగ్ పెంచాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశం : డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

రానున్న ఎన్నికలలో జిల్లాలో ఎథికల్ ఓటింగ్ జరిగే విధంగా, పోలింగ్ శాతం పెంపే లక్ష్యంగా స్వీప్ కార్యక్రమాలు జరుగుతున్నాయని స్వీప్ నోడల్ అధికారి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. మాదేపల్లి గ్రామ పంచాయతీ గురకలపేట కెనాల్ పనులు చేస్తున్న ఉపాధి హామీ చట్టం వేతనదారులతో ఓటుహక్కు వినియోగంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ 2019 సార్వత్రిక ఎన్నికలలో 79.77 శాతం రాష్ట్రంలో పోలింగ్ నమోదు కాగా జిల్లాలో 83.75 శాతం నమోదు అయ్యిందన్నారు. ఏలూరు నియోజకవర్గంలో అత్యల్ప ఓటింగ్ శాతం 68.10 శాతంగా నమోదైందని, ఇది రాష్ట్ర అవరేజ్ కన్నా తక్కువని వేతనదారులకు వివరించారు. జిల్లాలో 409 పోలింగ్ కేంద్రాలలో రాష్ట్రంలో నమోదైన పోలింగ్ శాతం కన్నా తక్కువ ఓటింగ్ నమోదు అయ్యిందని, దీనికి ప్రధాన కారణం పట్టణ ప్రాంతాలలో ఉన్న ఎగువ శ్రేణి వర్గం, యువత ఓటింగ్ ప్రక్రియలో భాగస్వామ్యం కాకపోవడమని తెలిపారు. రానున్న ఎన్నికలలో గ్రామాలలో ఉపాధిహామీ చట్టంలో పనిచేస్తున్న వేతనదారులు ఓటు వేసి జిల్లా ఓటింగ్ శాతం 92 శాతం స్థాయికి పెంచే విధంగా సహకరించాలని డిపిఒ కోరారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఓటర్స్ టర్న్ అవుట్ ప్రణాళికను ఆమోదించారని, దానిలో భాగంగా జిల్లాలో అనేక ప్రాంతాలలో స్వీప్ కార్యక్రమాలు చేపడుతూ ఓటర్లను చైతన్య పరుస్తున్నామన్నారు. ఓటుహక్కు వినియోగంపై అవగాహన పెంచుకొని ఓటుహక్కును అందరు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం వేతనదారులతో నినాదాలు చేయిస్తూ ఆంగ్లంలో స్వీప్ అక్షరమాల కార్యక్రమం నిర్వహించారు. డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్ ఉపాధి పనులు చేసి వేతనదారులను ఉత్తేజ పరిచారు. ఉపాధిపనులు చేసే కార్యక్రమంలో ఎపిఒ కిషోర్ కుమార్, పంచాయతీ కార్యదర్శి సుమలత, సాంకేతిక నిపుణుడు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిపిఒ

ఒక్కరోజులో 50 వేల మంది ఉపాధిహామీ వేతనదారులతో అవగాహన

జిల్లావ్యాప్తంగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి వేతనదారులతో అవగాహనా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ప్రాజెక్ట్ డైరెక్టర్ డ్వామా బి.రాము అన్నారు. జిల్లా వ్యాప్తంగా 27 మండలాలలో ఉపాధిహామీ వేతనదారులతో ర్యాలీలు, మానవహారాలు, ప్రతిజ్ఞలు తదితర కార్యక్రమాలు చేపట్టగా సుమారు 50 వేల మంది పాల్గొన్నారని అన్నారు. రానున్న రోజుల్లో మరెన్నో అవగాహనా కార్యక్రమాలు డ్వామా ద్వారా చేపట్టి గ్రామీణ ప్రాంతంలో ఏథికల్ ఓటింగ్ జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రసవత్తరంగా పోలవరం నియోజకవర్గ రాజకీయం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

2024 ఎన్నికలు మొత్తం పోలవరం సీటు వైపే చూస్తున్న తరుణంలో పోలవరం నియోజకవర్గం వైసిపి అభ్యర్థిగా తెల్లం రాజ్యలక్ష్మిని నియమిస్తూ శనివారం అధికారిక ప్రకటన వెలువడింది. రాష్ట్రంలోనే కీలకమైన జాతీయ ప్రాజెక్టు కలిగిన పోలవరం నియోజకవర్గంలో నాలుగు సార్లు ఎంఎల్ఎగా గెలిచిన తెల్లం బాలరాజుకు ప్రజలలో వ్యతిరేకత, అనారోగ్య సమస్యల వల్ల ఆ సీటును ఎంఎల్ఎ భార్య తెల్లం రాజ్యలక్ష్మికి కేటాయించారు. నియోజకవర్గంలో జరుగుతున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకొని పోలవరం వైసిపి ఎంఎల్ఎ టికెట్ తెల్లం రాజ్యలక్ష్మికి వస్తుందో లేదో అనే సందిగ్ధంలో ఇప్పటివరకు వైసిపి ఎదురుచూస్తూ ఉంది.

గతంలో ఈ పోలవరం వైసిపి సీటు కోసం పార్టీలో ఉన్నా, లేని వ్యక్తులు 20 మంది వరకు పోటీపడ్డారు. గత కొద్ది రోజులుగా పొత్తులో భాగంగా రాష్ట్రంలోనే హాట్ టాపిక్‌గా మారిన పోలవరం నియోజకవర్గం టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి ఎవరని? టిడిపి ప్రధాన కార్యాలయం నుంచి పోలవరం టిడిపి ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాస్ టికెట్‌పై ఆశలు వదులుకోవాలని, త్యాగాలకు సిద్ధం కావాలని గతంలో ఫోన్ ద్వారా తెలియజేశారు. అప్పటి నుంచి టిడిపి కేడర్లో ఉత్సాహం తగ్గి టిడిపి జాతీయ నాయకులను సైతం తిట్టే విధంగా కార్యక్రమాలు చేశారు.

టిడిపికి సంబంధించిన ఒక నాయకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం కూడా చేసిన కథనం చోటుచేసుకుంది. పోలవరం టిడిపి ఉమ్మడి అభ్యర్థిగా బొరగం శ్రీనివాసులును ప్రకటించకపోతే టిడిపి నుంచి గ్రామ, రాష్ట్రస్థాయి వరకు పొందిన పదవులు అన్నింటికీ మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే స్వతంత్ర అభ్యర్థిగా అయినా పోటీలో పెట్టి గెలిచి తీరతామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా ఐవిఆర్ఎస్ సర్వేలో మొడియం సూర్యచంద్రం, కుంజ వసంత, విజయ పేర్లు వినపడడంతో నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థిగా బొరగం శ్రీనివాసు లేదా చెర్రీ బాలరాజు ఇద్దరిలో ఒకరే ఉండాలని మూడో వ్యక్తికి అవకాశం ఇవ్వకూడదని కొయ్యలగూడెం అంతర్గత సమావేశంలో మాట్లాడారు. పోలవరం ఎంఎల్ఎ సీటు కోసం రెండు పార్టీలు పోటీ పడుతుంటే మూడో పార్టీగా బిజెపి సీనులోకి వచ్చింది. ఉమ్మడి అభ్యర్థి ఎవరు అనే సందిగ్ధంలో ఉన్నారు. పోలవరం జనసేన, బిజెపి, టిడిపి ఉమ్మడి అభ్యర్థిగా బొరగం శ్రీనివాసులు ఉంటే వైసిపి అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మికి గెలుపు కష్టమే అన్నట్టుగా ఉంది కానీ బొరగం శ్రీనివాసులు కాకుండా మరే అభ్యర్థికి ఇచ్చిన తెల్లం రాజ్యలక్ష్మి పోలవరం సీటు గెలవడం ఖాయమని అందరి అభిప్రాయం. ఇన్ని ఊహాగానాల మధ్య పోలవరం, జనసేన, టిడిపి ఉమ్మడి అభ్యర్థిత్వం ఎవరిని వరిస్తుందో వేచి చూద్దాం.

అవుట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

కృష్ణా జిల్లా కోర్టులో స్టెనోగ్రాఫర్(పర్సనల్ అసిస్టెంట్)లను అవుట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయుటకు దరఖాస్తులు కోరుతున్నట్లు కృష్ణా జిల్లా జడ్జి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 6 పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నామని, నెలకు రూ.18,500 వేతనం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుదారులు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ అర్హత కలిగి ఉండాలని, టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్‌లో హయ్యర్ గ్రేడ్ కలిగి, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఇంగ్లీష్ షార్ట్ హ్యాండ్‌లో హయ్యర్ గ్రేడ్ అర్హత కలిగిన వారు లేని ఎడల, ఇంగ్లీష్ షార్ట్ హ్యాండ్‌లో లోయర్ గ్రేడ్ అర్హత కలిగిన వారిని పరిగణనలోనికి తీసుకోవడం జరుగుతుందన్నారు. వయస్సు 18 నుంచి 42 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతుల వారికి 5 సంవత్సరాలు, విభిన్నప్రతిభావంతులు, మాజీ సైనికోద్యోగులకు 10 సంవత్సరాల వయస్సు సడలింపు ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను సంబంధిత ధృవీకరణ పత్రాల నకళ్లను జతచేసి ఏప్రిల్ 12వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, కృష్ణా జిల్లా, మచిలీపట్టణం వారికి పంపాలని తెలియజేశారు.

మాజీ ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరంలో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కైకరానికి చెందిన కోనా శ్రీనివాసరావు, ఆయన సోదరుడు హనుమాన్ బాబులు రూ.3 లక్షల వ్యయంతో విగ్రహం చుట్టూ కాంక్రీట్ చదును చేయించారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన కోనా బ్రదర్స్ సేవలను వక్తలు కొనియాడారు. అనంతరం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, వాసవీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. కైకరాన్ని దత్తత తీసుకుని ఎన్నో సామాజిక, అభివృద్ధి పనులకు తన సొంత నిధులను వెచ్చించిన కోనా శ్రీనివాసరావు సోదరుల సేవలను ఈ సందర్భంగా అభినందించారు.

డిఎన్ఆర్‌ను ఆశీర్వదించాలి

కోడలు ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావును మరోసారి ఆశీర్వదించాలని ఆయన కోడలు దూలం స్వాతి శనివారం పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని వైవాక గ్రామంలో ఇంటింటా తిరిగి సార్వత్రిక ఎన్నికల ప్రచారం చేశారు. మరోమారు డిఎన్ఆర్‌ను ఆశీర్వదించాలని మహిళలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ ప్రచారంలో ఆమె వెంట జెడ్‌పిటిసి వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపిపి సునీత పాల్గొన్నారు.

'ఫ్లెక్సీలు తొలగించాలని ఆదేశించడం సరికాదు'

ప్రజాశక్తి - కామవరపుకోట

రానున్న ఎన్నికల్లో పోటీచేయని రాజకీయ పార్టీల జెండాలను, ఫ్లెక్సీలను తొలగించమని ఆదేశించడం సరికాదని, ఎన్నికల కమిషన్ నియమావళి సవరించాలని సిపిఐ మండల కార్యదర్శి టివిఎస్ రాజు అన్నారు. మండల తహశీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల సమావేశం నిర్వహణపై తమ పార్టీకి ఆహ్వానం అందించారన్నారు. సదరు ఆహ్వానం మేరకు ఉదయం 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేశారని, సిపిఐ మండల కమిటీ తరుపున మండల సహాయ కార్యదర్శి కంకిపాడు బుచ్చిబాబుతో కలిసి ఉదయం 10 గంటల 45 నిమిషాలకు తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొన్నామన్నారు. మధ్యాహ్నం ఒంటిగంట అయినా తాము తప్ప ఇతర ఏ రాజకీయ పార్టీ ప్రతినిధులు హాజరు కాలేదని, దీనిపై ఇన్‌ఛార్జి తహశీల్దార్‌ని కలిసి ఎందుకు సమావేశం ఏర్పాటు చేశారని, సమావేశం ఎజెండా ఏంటని ప్రశ్నించగా శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎన్నికల కోడ్ అమలోకి వస్తుందని, కావున బహిరంగ ప్రదేశాల్లోని ఆయా పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు తొలగించడం కోసం సమావేశం ఏర్పాటు చేశామని ఇన్‌ఛార్జి తహశీల్దార్ తెలియజేశారని టివిఎస్ రాజు తెలిపారు. ఎన్నికల కోడ్ 3 గంటలకు అమలు కాబోతుంటే ముందుస్తుగానే తమ పార్టీ జెండాలు, ఫ్లెక్సీలను స్వచ్ఛందంగా తొలగించి, పార్టీ స్థూపాలకు గుర్తు కనిపించకుండా పరకాలు కట్టడం జరిగిందని, దీనిని సవరించాలని కోరారు.

భూసార పరీక్షల ఆధారంగా అధిక లాభాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఉత్తర తేలికపాటి నేలల్లో భూసార పరీక్షల ఆధారంగా పంటలు పండిస్తే అధిక లాభాలు వస్తాయని సిటిఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషు మాధవ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక సిటిఆర్ఐలో చిన్న, సన్నకారు రైతులకు సమీకృత వ్యవసాయం, భూసార పరీక్షల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం ఉండాలన్నారు. తద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా వ్యవసాయంలో పశువుల వల్ల కలిగే ఉపయోగాలను కూడా రైతులకు సూచించారు.

ఈ సందర్భంగా నేలలో మట్టి సేకరణ విధానంపై కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులలో భాగంగా పలువురు రైతులకు వ్యవసాయ పనిముట్లను, పశువుల దాణాను అందించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎల్‌కె.ప్రసాద్, పూర్ణ బిందు, సిటిఆర్ఐ హెడ్ వైవి.సుబ్బయ్య, వెటర్నరీ సహాయ సంచాలకులు ఎమ్.సాయి బుచ్చారావు, అసిస్టెంట్ ఫామ్ మేనేజర్ రమేష్, సిబ్బంది ప్రభు, మూర్తి రాజు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి దశలవారీ శిక్షణ

ఆర్‌డిఒ వై.భవానీశంకరి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సిబ్బందికి వివిధ దశలలో పూర్తిస్థాయి శిక్షణ అందించడం జరిగిందని ఆర్‌డిఒ వై.భవానీ శంకరి తెలిపారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒ భవానీ శంకరి శనివారం మాట్లాడుతూ 286 పోలింగ్ స్టేషన్ల పరిధిలో అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలియజేశారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాలలో ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి మృతి చెందిన దళిత యువకుడు హర్ష కుమార్ కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే పరిహారాలు అందజేయాలని, వారి కుటుంబానికి తగు న్యాయం చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నల్లి రాజేష్ డిమాండ్ చేశారు. శనివారం పట్టిసీమ గ్రామంలో జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాలలో అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యుత్ షాక్‌కి గురై మృతి చెందిన దళిత యువకుడు హర్ష కుమార్ కుటుంబానికి రోజులు గడుస్తున్నా పరిహారం అందించడంలో విద్యుత్ శాఖ అధికారులు విఫలమయ్యారన్నారు. మృతుని కుటుంబానికి రెండు ఎకరాల భూమి, రూ.5 లక్షల పరిహారం తక్షణమే చెల్లించాలని, లేనిపక్షంలో విద్యుత్ శాఖపై హత్యా నేరంపై కేసు పెడతామని హెచ్చరించారు. మృతుని కుటుంబానికి సహాయం అందని పక్షంలో రాష్ట్రస్థాయిలో విద్యుత్ శాఖ అధికారులపై ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈనెల 25వ తేదీలోగా మృతుని కుటుంబానికి న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోబ్బన మోహన్, జిల్లా అధ్యక్షులు గుండె నగేష్ బాబు, రాష్ట్ర కార్యదర్శులు కర్ని జోగయ్య, మోతా నరసింహారావు, జిల్లా కార్యదర్శులు ఏనుగుపల్లి చంద్రశేఖర్, కొయ్యలగూడెం రొక్కాల నాగరాజు, తొర్లపాటి శ్రీనివాస్, తండా ఇస్సాకు రాజు పాల్గొన్నారు.

'వైసిపి హయాంలో ప్రజారోగ్యానికి పెద్దపీట'

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రజల ఆరోగ్యానికి వైసిపి అధిక ప్రాధాన్యత ఇస్తుందని చింతలపూడి వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. ఆయన క్యాంప్ ఆఫీస్‌లో సిఎం ఆర్ఎఫ్ చెక్కులు లబ్ధిదారులకు వైసిపి నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం మండల అధ్యక్షులు జానకి రెడ్డి, టౌన్ అధ్యక్షులు కొప్పుల నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి వరలక్ష్మి, వైసిపి నాయకులు రాజేష్ నాయుడు, సింగిరెడ్డి భరత్ రెడ్డి పాల్గొన్నారు.

బాణసంచా పేల్చిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎన్నికల సంఘం శనివారం విడుదల చేసిన ఎన్నికల షెడ్యూల్‌తో రాష్ట్రానికి పట్టిన వైసిపి పీడ వదులుతుందని, ఇంక రాష్ట్రంలో ప్రజలకు మరో 57 రోజుల్లో మంచి రోజులు రాబోతున్నాయని టిడిపి నాయకులు కొడాలి వినోద్ అన్నారు. ముదినేపల్లిలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి, బాణాసంచా కాల్చి హర్షం వ్యక్తం చేస్తూ గడిచిన 5 సంవత్సరాల దుష్టపాలన నుంచి విముక్తి లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీహరిపురం సర్పంచి పరసా విశ్వేశ్వరరావు, రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యదర్శి పంతగాని సురేష్, మండల ప్రధాన కార్యదర్శి బొంగు రవి కుమార్ పాల్గొన్నారు.

పైపులైన్ నిర్మించాలని గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి - ముదినేపల్లి

రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ముదినేపల్లి సెంటర్‌లో చేపట్టిన డ్రయినేజీ నిర్మాణాల పేరుతో కాంట్రాక్టర్ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన మంచినీటి పైప్‌లైన్ ధ్వంసం చేయడం వల్ల గ్రామస్తులకు తాగునీటి సరఫరా నిలిచిపోయిందని గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ గ్రామస్తులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచి కైకమ్మ మాట్లాడుతూ వెంటనే ప్రొక్లైన్తో కాంట్రాక్టర్ ధ్వంసం చేసిన పైపులైన్‌ను వెంటనే పునరుద్ధరించాలన్నారు. లేకుంటే డ్రయినేజీ నిర్మాణ పనులు జరగనివ్వమని హెచ్చరించారు. కాంట్రాక్టర్, నేషనల్ హైవే అధికారులు వెంటనే స్పందించి ధ్వంసమైన పైప్‌లైన్ స్థానంలో నూతన పైపులైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. ఈ ఆందోళనలో గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రముఖులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జగదాంబ ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని జీలుగుమిల్లి గ్రామంలో వేంచేసియున్న జగదాంబ అమ్మవారి 67వ వార్షికోత్సవ ఉత్సవాలను శనివారం పోలవరం నియోజకవర్గ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గ్రామంలో ఉన్న జగదాంబ, ఎల్లమ్మతల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాలు ఈనెల 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ ఛైర్మన్ కక్కిరాల రాము తెలిపారు.

ఒరిజినల్ పొలం డాక్యుమెంట్స్ పోయినవి

గూడూరి వెంకటేశ్వరరావు (ఆధార్ 9852 9531 2481) క్లర్క్, పిఏసిసి సొసైటీ, పెనుమదం, డోర్ నెంబర్ 3-50, S/o. సూర్యమూర్తి, పెనుమదం-534267, పోడూరు మండలం, ప॥గో॥జిల్లా అయిన నేను, కోరు విన్నపం ఏమిటంటే ది. 11-3-2024వ తేదీన పాలకొల్లులోని బ్యాంకు నుండి నా పొలం ఒరిజినల్ డాక్యుమెంట్లు మోటార్ సైకిల్‌పై పెనుమదం ఇంటికి తీసుకుని వస్తుండగా దారిలో పడిపోయినవి. ఎంత వెతికినా దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికిన నాకు అందజేయవలసిందిగా కోరి ప్రార్థించుచున్నాను.

ఇట్లు: గూడూరి వెంకటేశ్వరరావు
సెల్: 8978790566

ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్స్ పోయినవి

పాలకొల్లు మండలం, లంకలకోడేరుకు చెందిన ఎస్.ఎస్.చంద్ర బొమ్మగాని, టీచర్, ఆధార్ నెంబర్ 2102 7633 3411 నియర్ 3-146, గ్రామ కచేరి వద్ద, లంకలకోడేరు, పాలకొల్లు మండలం, ప॥గో॥జిల్లా తెలియజేయునది ఏమనగా,

ది. 02-3-2024వ తేదీన మా ఇంటి నుండి లంకలకోడేరు మెయిన్ సెంటర్‌కు నా బి.ఈడి. ఒరిజినల్ డిగ్రీ పత్రాలు, కన్సెర్న్ మార్క్స్ మెమో ఒరిజినల్ సర్టిఫికెట్స్ జిరాక్స్ తీయించేందుకు మోటార్ సైకిల్‌పై వెళుతుండగా దారిలో పడిపోయినవి. ఎంత వెతికిన దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికిన యెడల నా పై అడ్రస్‌కు అందజేయవలసిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.

ఇట్లు: ఎస్.ఎస్.చంద్ర బొమ్మగాని
సెల్: 8500427549

దస్తావేజులు పోయినవి

గంటా గాయత్రి అనే కిన్నెర, భర్త: వెంకటరమణ, ఇరగవరం మండలం, ఓగిడి గ్రామం, పశ్చిమగోదావరి జిల్లా అను నేను యావన్మందికి తెలియజేయడమేమనగా నాకు సంబంధించి అనగా పెనుగొండ మండలం, పెనుగొండ గ్రామపంచాయతి పరిధి చెరుకువాడ గ్రామానికి చెందిన రి.స.నెం. 128/4బి దాఖలా డోర్ నెంబర్ 28-41 రుకు సమీపమున గల చ॥గ॥ 146లు గల ఖాళీ నివేశన స్థలము సంబంధించి **దస్తావేజు నెంబర్ 1236/2014** ఒరిజినల్ దస్తావేజులు మరియు దాని **లింక్ డాక్యుమెంట్ నెం. 3361/2011** కు గల ఒరిజినల్ దస్తావేజులు రెండును ఒక కవర్లో పెట్టుకొని మా అమ్మ గ్రామ పెనుగొండ వచ్చి మా మేనమామ బైక్‌కు డాక్యుమెంట్స్ కవరు తగిలించుకుని జిరాక్స్ షాపుకి వెళ్లి వస్తుండగా మార్గ మధ్యలో పడిపోయినది. కావున దొరికినవారు ఈక్రింది అడ్రసుకు సంప్రదించగలరు.

అడ్రస్:
గంటా గాయత్రి అనే కిన్నెర
W/o. వెంకటరమణ, ఓగిడి గ్రామం
ఇరగవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 9121833637